దివాకర్‌రావు పరామర్శ



బస్వేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 23 : లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఊత్కూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కనకమేడల బస్వేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు నాయకులతో కలిసి పరామర్శించారు. బస్వేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా పనులు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 23 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల గోదావరిలో సోమవారం మున్సిపల్ అధికారులు, కార్మికులు శ్రమదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ నేతృత్వంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, మేనేజర్ విజయ్‌కుమార్‌తో పాటు, పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని తొలగించారు. జలాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గోదావరిలో స్నానాలకు వచ్చే వారు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునే వారు చెత్త వేయొద్దని కమిషనర్ సూచించారు.

హాజీపూర్, సెప్టెంబర్ 23 : మండలంలోని ఆయా జీపీల్లో కార్యదర్శులు స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహించారు. జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యదర్శులు, కారోబార్లతో పాటు జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 : కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి జడ్పీ సెకండరీ పాఠశాలలో పేపర్ మిల్లు స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ రీనా బిల్ వాల్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ బాయి తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ, నస్పూర్ 23 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులో చైర్మన్ సుర్మిల్ల వేణు, కమిషనర్ సతీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది మాస్ క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

వాంకిడి, సెప్టెంబర్ 23 : వాంకిడి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీవాసులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఇంద్రానగర్‌లో శానిటరీ, పరిసరాలను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, నాయకులు గుర్నులే నారాయణ, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి 'పొలంబాట'

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 23 : రైతుల సమస్యల పరిష్కారం కోసం 'విద్యుత్ అధికారుల పొలంబాట' కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆ శాఖ ఎస్ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వంగిన స్తంభాలు, వదులుగా ఉన్న తీగలను సరిచేస్తున్నామని, మధ్యలో స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మోటార్లకు పెట్టుకునన ఆటో స్టార్టర్లను తొలగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు లేకుండా సరఫరా అందించేందుకు పంపుసెట్లకు కెపాసిటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫాక్టర్ మెరుగుపడి ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వ్యవసాయదారులు వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎస్ అనిల్‌కుమార్

రెబ్బెన, సెప్టెంబర్ 23 : ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి కృషి చేస్తానని పీఆర్టీయూ టీఎస్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో గల పద్మశాలీ భవన్‌లో సోమవారం పీఆర్టీయూ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అందులో పోటీ చేసి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం మాట్లాడారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాసరావు, ఎన్నికల అధికారులు శ్రీనివాసరావు, కిషన్, వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, హెచ్ఎంలు, ఎంఈవోలు, రాష్ట్ర కార్యవర్గసభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 23 : సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం సూచించారు. మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో సోమవారం సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు, భూమి కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంక్, ఇతర కేసులను రాజీమార్గంలో లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ, కాగజ్‌నగర్ సీఐ, ఎస్ఐలు, సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్, కౌటల సీఐ, ఎస్ఐలతో పాటు, సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పలు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

వేమనపల్లి, సెప్టెంబర్ 23 : బెల్లంపల్లి కోర్టులో 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడే కేసులు, కొన్ని కేసుల్లో నేరం ఒప్పుకుంటే జరిమానాలు విధించి కేసులు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలల పనివేళలు ఒకేలా ఉండాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 : విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని యాజమాన్య గురుకుల పాఠశాలల పనివేళలు ఒకేలా ఉండాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. టీఎస్ యూటీఎఫ్, గురుకుల జేఏసీ పిలుపు మేరకు గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రెండో దఫా పోరాటంలో భాగంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. గురుకులాల్లో మెస్ చార్జీలు పెంచాలని, అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ చేయాలి, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని, తదితర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే 28న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ప్రతినిధులు పార్వతి, సంతోష్, సురేందర్, మహేశ్, అనిల్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా 28న ప్రారంభించనున్న ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి సాంస్కృతిక ఉత్సవాల కింద అనేక అంశాల్లో పోటీల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతీయువకులకు జానపద నృత్యం–సమూహం, జానపద నృత్యం–వ్యక్తిగతం, జానపద పాట–సమూహం, జానపద పాట–వ్యక్తిగతం, లైఫ్ స్కిల్స్, కాంపోనెంట్–కథా రచన, పోస్టర్ మేకింగ్, సైన్స్ ఫెయిర్ మేళ, ప్రకటన, ఫొటోగ్రఫీ పోటీలు, టెక్స్ టైల్స్, వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రతి అంశంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలను నిర్ణయించి, ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీలు జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్/ఫంక్షన్ హాల్ లో ఉంటాయని వివరించారు. వివరాలకు 94400 10453 నంబర్‌ను గానీ, జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్ : మంచిర్యాలలో కలెక్టర్ కుమార్ దీపక్..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, సెప్టెంబర్ 23 : ప్రజావాణిలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని వినతి పత్రం అందించాడు. రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామస్తులు.. తమ గ్రామాన్ని ఖైర్‌గాం గ్రామ పంచాయతీ నుంచి వేరు చేసి, నూతన జీపీగా ఏర్పాటు చేయాలని దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం పరందోలి, ముఖదం గ్రామస్తులు.. తమ గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నదని, సమస్య పరిష్కరించాలని అర్జీ పెట్టారు. కౌటల మండలం గుడ్లబొరికి చెందిన పాలే రామ్‌దాస్.. పంచాయతీ సర్పంచ్‌గా 14 నెలలుగా పనిచేశానని సంబంధిత వేతనం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో వివధ శాఖల అధికారులు తదితరులున్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 23 : ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డీఆర్డీవో కిషన్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బెల్లంపల్లి, నస్పూర్, లక్షెట్టిపేట, హాజీపూర్, నెన్నెల, కాసిపేట, కన్నెపల్లి, కోటపల్లి మండలాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో 35 దరఖాస్తులు అందాయని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, సెప్టెంబర్ 23 : రుణమాఫీ కాలేదని కన్నెపల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన పలువురు రైతులు మంచిర్యాల కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన చాలా మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని, తమకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, మొండి, హన్మంతు, అంకులు, మల్లయ్య, నయిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 : కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఓ దివ్యాంగుడు కార్యాలయానికి వచ్చాడని తెలుసుకున్న ఆమె, బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆ దివ్యాంగుడు ఖయ్యూం మాట్లాడుతూ.. ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న మున్సిపల్ గదులను దివ్యాంగుల రిజర్వేషన్ ప్రకారం తమకు కేటాయించాలని కోరాడు. ఇందిరా మార్కెట్, గాంధీ పార్కుల వద్ద ఉన్న గదులను సైతం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 66 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు.

కోటపల్లిలో అధికారుల డుమ్మా.

కోటపల్లి, సెప్టెంబర్ 23 : కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు డుమ్మా కొట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డితో పాటు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీనాథ్ స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాదవి మాత్రమే హాజరయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణికి మండలాధికారులు హాజరుకావాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నా, పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా జిల్లా అధికారులు కోటపల్లి ప్రజావాణిపై దృష్టి పెట్టి, ప్రజావాణికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జన్నారం, సెప్టెంబర్ 23 : మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువుల హద్దులను గుర్తించి, వివరాలను ఇవ్వాలని పరిరక్షణ కమిటీ చైర్మన్ కమ్మల విజయధర్మ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో శశికళకు వినతి ప త్రం అందజేశారు. అధికారులు జలేందర్, బుచ్చన్న, రమాదేవి, సభ్యులు భూమాచారి తిరుపతి, ఎండీ సత్యం, మహేశ్ పాల్గొన్నారు.

కాసిపేట, సెప్టెంబర్ 23 : కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు పలు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్ కుమార్ వినతిపత్రం అందించారు. కొండాపూర్ యాప నుంచి సోనాపూర్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు భారీగా పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తొలగించాలని, చిన్న ధర్మారంలో తాగునీటి సమస్య, గ్రామానికి వెళ్లే దారిలో వంతెన మరమ్మతులు చేయించాలని, రొట్టెపెల్లి జీపీ పరిధిలో రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కరించాల కోరారు.

నేడు డివిజన్‌స్థాయి క్రీడలు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 23 : పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల మైదానంలో మంగళవారం ప్రభుత్వ ఆశ్రమ సంక్షేమ శాఖ డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మడావి గంగారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17బాలబాలికల విభాగంలో కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, ఆర్చరీ ఉంటాయని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి కనీసం 15 మంది క్రీడాకారులు పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జోనల్‌స్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. అక్కడ గెలుపొందిన వారికి వచ్చే నెల 1న ఆసిఫాబాద్ క్రీడా పాఠశాలలో బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నట్లు వివరించారు.

అంధుల సంస్థకు విద్యార్థుల సాయం

నస్పూర్, సెప్టెంబర్ 23 : హైదరాబాద్‌లోని ఐటీఆర్ఆర్ వోడీడీ అంధుల సంస్థకు మంచిర్యాలలోని రివిలేషన్ పాఠశాల విద్యార్థులు రూ.81వేల సాయం అందించారు. విద్యార్థులు సేకరించిన డబ్బుతో పాటు, పాఠశాల ఉపాధ్యాయుల ఒక రోజు వేతనాన్ని కలిపి సోమవారం నిర్వాహకులకు మంచిర్యాలలోని పాఠశాలలో చెక్కు అందజేశారు. కరెస్పాండెంట్ రాపోలు విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, సెప్టెంబర్ 23 : మంచిర్యాలలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న బోధన పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఆఫీసర్, సీఆర్పీ, పీజీసీఆర్టీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ నిజ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 25న డీఈవో కార్యాలయంలో హాజరవ్వాలని సూచించారు.

లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలి

తాండూర్, సెప్టెంబర్ 23 : ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో వాసాల ప్రభాకర్ సూచించారు. రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్‌పై తెలుగు బోధించే ఉపాధ్యాయులకు సోమవారం తంగళ్లపల్లి హైస్కూల్‌లో ఒకరోజు మండలస్థాయి శిక్షణ నిర్వహించచారు. మండల నోడల్ అధికారి ఎస్ మల్లేశం, తాండూర్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్లు హరి ప్రసాద్, విద్యాసాగర్, వేణుగోపాల్ రావు, సురేశ్, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులు సీఆర్పీ నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

రైల్వే ఏడీఈకి వినతి

తాండూర్, సెప్టెంబర్ 23 : మండలంలో ప్రజలకు నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్న (తాండూర్–ఆర్సీ–66, 67) రైల్వే అండర్ బ్రిడ్జిల్లో పాస్ రోడ్ల సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని కోరుతూ నాయకులు సిరంగి శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం తాండూర్ నాయకులతో కలిసి సమస్యలు వివరించారు. మాసాడి తిరుపతి, జావేద్, గౌస్, ఆదంఖాన్, ముడిమడుగుల సురేశ్ తదితరులున్నారు.

విజయవంతం చేయండి

చెన్నూర్, సెప్టెంబర్ 23 : గురుకులాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయ వంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు పిలుపునిచ్చారు. చెన్నూర్‌లోని పలు గురుకులాలను సోమవారం ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లోని విద్యార్థుల సమస్యలతో పాటు అందులో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దహెగాం, సెప్టెంబర్ 23 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతి కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. నిధుల కొరత, పని ఒత్తిడి, నెలనెలా వేతనాలు అందించక ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు చౌదరి రాజేశ్, కార్యదర్శులు శ్రావన్‌కుమార్, విజయ్‌కుమార్, సుమలత, లత, శ్రీకాంత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, సెప్టెంబర్ 23 : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలపై ఎంపీవో మహేందర్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు. పనిభారంతో పాటు ఆర్థిక, మానసిక సమస్యలను పరిష్కరిచాలని కోరారు.

నీటి సహాయకుల సేవలు మరువలేనివి

జైపూర్, సెప్టెంబర్ 23: గ్రామాల్లో నీటి సరఫరా సేవకుల సేవలు మరువలేనివని, ప్రజలకు తాగునీరు సరఫరాలో మరింత అంకితభావంతో పనిచేయాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ (సీఈఈ) జ్ఞానకుమార్ పేర్కొన్నారు. జైపూర్ రైతు వేదికలో భీమారం, జైపూర్, మందమర్రి మండలాల నీటి సహాయకులకు 4 రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, ఏఈలు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో భిక్షపతి గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ అధికారులు మండలంలోని కార్మికులకు నీటి సరఫరా నిర్వహణపై శిక్షణ కల్పిం చారు. కార్యక్రమంలో మిసన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, సెప్టెంబర్ 23 : కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో నీటి సహాయకులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మహమ్మద్ జాఫర్ శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీవై ఈఈ రతన్ కుమార్, ఏఈఈ అచ్యుత్, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ, మిషన్ భగీరథ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

వాంకిడి, సెప్టెంబర్ 23 : వాంకిడి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడబ్ల్యూలకు ఎంపీవో ఖజా అజీజుద్దీన్, మిషన్ భగీరథ డీఈఈ ఇర్ఫాన్‌తో కలసి నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల మల్టీపర్పస్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి,సెప్టెంబర్ 23 : ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని జీపీ కార్మికులకు నీటి సరఫరా నిర్వహణపై ఎంపీడీవో మహ్మద్ అమ్జద్ పాషా, మిషన్ భగీరథ డీఈ రాకేశ్, ఏం విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని సూచించారు.

బెల్లంపల్లి, సెప్టెంబర్ 23 : బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బెల్లంపల్లి, తాండూర్ మండలాలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో మహేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంబంధిత మండల అధికారులు పాల్గొన్నారు.

లక్షెటిపేట, సెప్టెంబర్ 23 : లక్షెట్టిపేట ఎంపీడీవో కార్యాలయంలో హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్, హాజీపూర్ ఏఈ గిరిజ, వాటర్‌మన్లు, పంప్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అల్లీపూర్ చెరువు కబ్జాపై సర్వే

దండేపల్లి, సెప్టెంబర్ 23 : దండేపల్లి మండలం అల్లీపూర్ చెరువు విస్తీర్ణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ సంధ్యారాణి సిబ్బందితో కలిసి సోమవారం సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 100లో 59.33 ఎకరాల చెరువు విస్తీర్ణం కాగా, గతంలో చెరువు ఆక్రమణకు గురైందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్, తహసీల్దార్ మాట్లాడుతూ.. చెరువుతో పాటు, పక్కన ఉన్న పట్టాదారుల హద్దులను సర్వే చేసేందుకు మరో మూడు రోజుల సమయం పడుతుందన్నారు. అనంతరం సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఎంపీడీవో ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ ఏఈ విజయ్‌భాస్కర్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాల, సెప్టెంబర్ 23 : మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన, గ్రామ పంచాయతీల కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో కార్యాలయం ముందు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చెట్ల ఆకులు తింటూ నిరసన వ్యక్తం తెలిపారు. జిల్లా నాయకుడు దుంపల రంజిత్ మాట్లాడుతూ.. కార్మికులను పండుగ పూట కూడా ప్రభుత్వం పస్తులు ఉంచుతుందా అని ప్రశ్నించారు. వెంటనే దసరా లోగా పెండింగ్ వేతనాలు మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో, ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కార్మికులు కాంతమ్మ, రజిత, సత్తమ్మ, పోశవ్వ, రాజవ్వ, సాగర్, రాజమల్లు, సుధాకర్, రాజన్న పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు

కాసిపేట, సెప్టెంబర్ 23 : కాసిపేట మండలం సోమగూడెం, చొప్పరపల్లి, కాసిపేట, కోమటిచేను గ్రామాల్లో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో నార్కోటిక్ డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తులు, గంజాయి సేవించే వారిని లక్ష్యంగా చేసుకొని వారి ఇండ్లు, పరిసర ప్రాంతాల్లో, అలాగే గంజాయి సేవించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తనిఖీ చేశారు. పాత నేరస్తులతో ఎస్ఐ మాట్లాడి, వారి ప్రస్తుత జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలు పాటించాలి

వాంకిడి, సెప్టెంబర్ 23 : మండలంలోని అన్ని విత్తనాల దుకాణాదారులు నిబంధనలు పాటించాలని వాంకిడి వ్యవసాయ అధికారి గోపికాంత్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఈవోలు, సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల వ్యాపారులు, డీలర్లు జీ ప్రవీణ్ కుమార్, జీ శివ కుమార్, లక్ష్మీనారాయణ, వడెపల్లి సతీశ్, రామగిరి శ్రావణ్ కుమార్, షేక్ ఇబ్రహీం, సెండే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : జిల్లాలోని అర్హులైన ట్రాన్స్ జెండర్లు గుర్తింపు కార్డు, ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవనోపాధి కింద వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకొని సాధారణ జీవనాన్ని గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న 24 మందికి గుర్తింపు కార్డు, ధ్రువపత్రాలు అందించినట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ రవికుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

నూతన భవనం నిర్మించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : ఆసిఫాబాద్ మండలంలోని వావుదాం గిరిజన పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు సోమవారం వినతి పత్రం అందజేశారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, రైతు వేదుకలో ఏడాది పాటు తరగతులు కొనసాగించారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు ఇబ్బందవుతున్నదని చెప్పడంతో జీపీ కార్యాలయం బయట బోధన కొనసాగుతున్నది, విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీకనంద్, కార్తిక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు భీం రావ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూర్ కాపు సంఘం నిర్మల్ జిల్లా బాధ్యుడిగా లక్ష్మణ్

కాశెట్టి లక్ష్మణ్

జన్నారం, సెప్టెంబర్ 22 : మున్నూర్ కాపు సంఘం నిర్మల్ జిల్లా బాధ్యుడిగా మండలంలోని బాదంపెల్లి గ్రామానికి చెందిన మండలాధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్‌ను నియమిస్తూ రాష్ట్ర సంఘం అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తంరావు ఉత్తర్వులు జారీచేశారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పురుషోత్తంరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'అక్రమ కట్టడాల కూల్చివేత చట్టబద్ధమే'

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 23 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 42 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో డీకొండ అన్నయ్య అక్రమంగా నిర్మించిన భవనం కూల్చివేత చట్టబద్ధమైనదేనని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో చాలా మంది నాయకులు ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను చట్టపరిధిలో స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారు. మంచిర్యాల ఐబీ స్థలంలో మాతా శిశు దవాఖాన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, సెప్టెంబర్ 23 : బెల్లంపల్లి మహాత్మా జ్యోతి బాపూలే గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు సాయి ప్రియ (వాలీబాల్), మైత్రి(కుస్తీ), శరణ్య (కుస్తీ) ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట బాలుర పాఠశాలలో సోమవారం నిర్వహించిన అండర్–19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల, బాలికల వాలీబాల్, కుస్తీ పోటీల్లో ప్రతిభ చూపినటుల పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్, పీడీ కే శోభారాణి, పీఈటీ మమత ప్రత్యేకంగా అభినందించారు.

డెంగ్యూతో బాలిక మృతి

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 23 : లక్షెట్టిపేట పట్టణంలోని ఇటిక్యాలకు చెందిన దావనపల్లి దీక్ష(12) సోమవారం డెంగ్యూతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీక్ష 15 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా, పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించారు. ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌కు రెఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచింది. దీక్ష ఇటిక్యాల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.

న్యాయం చేయాలని ఆందోళన..



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతు పత్రు, అతని కుటుంబం

కౌటాల, సెప్టెంబర్ 23 : 'నా భూమిని వేరే వాళ్లకు పట్టా చేసిన్రు. తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇకనైనా నాకు న్యాయం చేయండి. లేదంటే ఇక్కడే పురుగుల మందు తాగి చస్తాం' అంటూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన మండవ్‌గడే పత్రు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగాడు. మండవ్‌గడే పత్రు మాట్లాడుతూ గుండాయిపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 167/28లో 5 ఎకరాల భూమి ఉందని, గతేడాది దానిని ఎల్ములే బాపుజ్‌రావు పేరిట పట్టా చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై అధి కారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇకనైనా తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. తహసీల్దార్ పుష్పలత స్పందిస్తూ పాత రికార్డులను పరిశీలించి న్యా యం చేస్తానని హామీ ఇచ్చారు. అయినా పత్రు వినిపించు కోలేదు. తక్షణమే న్యాయం చేయకుంటే మందు తాగుతాన ని డబ్బా తీయడంతో కుటుంబ సభ్యులు దానిని లాగేసు కున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని పత్రుతో పాటు అ తని కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి నచ్చజెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 23 : గురుకులాల్లో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అన్ని యాజమాన్యాల గురుకుల పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల పనివేళలు ఒకేలా ఉండాలని, 317 ద్వారా ఇతర జోన్ అలర్ట్ అయి స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జోన్లకు పంపించాలని, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 12 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర బాధ్యులు గణేశ్, నాయకులు హేమంత్ షిండే, సత్యనారాయణ, సుధాకర్, రమేశ్, ఓంకార్, మారుతి, వేణుగోపాల్, దేవాజీ, రాజేశ్వర్, గోపాల కృష్ణ, తిరుపతి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

25న భీం వర్ధంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

కెరమెరి, సెప్టెంబర్ 23 : కుమ్రం భీం వర్ధంతి ఉత్సవ కమిటీ ఎన్నిక ఈ నెల 25న నిర్వహించనున్నట్లు రాయి సెంటర్ సార్‌మేడి పెందోర్ రాజేశ్వర్, ఉప సార్‌మేడీ దంబీ రావ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సోమవారం వారు మాట్లాడారు. భీం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అనంతరం వర్ధంతి, దర్బార్ కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు కోవ విజయ్ కుమార్, భరత్ భూషణ్, భీంరావ్, కనక ప్రభాకర్, సోము తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

నస్పూర్, సెప్టెంబర్ 23 : మందమర్రి మండలం శ్రీపతినగర్‌కు చెందిన రుద్రారపు లక్ష్మిని సఖి కేంద్రం ద్వారా శ్రీసాయి దృష్టి వృద్ధాశ్రమంలో చేర్పించినట్లు జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి స్వరూపరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీకి ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, భర్త మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో పిల్లలు ఆమె పోషణను పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు విన్నవించిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో సఖి ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్జానాబేగం, జూనియర్ అసిస్టెంట్ రవికాంత్, సీఏ శ్రీలతతో సఖి వాహనంలో తీసుకువెళ్లి వృద్ధాశ్రమంలో చేర్పించినట్లు వివరించారు.

ఇసుక అక్రమ నిల్వల సీజ్

జైపూర్, సెప్టెంబర్ 23 : మండలంలోని ఇందారంలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన సూమారు 53 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సోమవారం తహసీలాదర్ వనజారెడ్డి సీజ్ చేశారు. గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోచింగ్‌పై అవగాహన

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 : కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర, వివేకానంద, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌వేర్ ఉచిత శిక్షణపై గోలేటి సోషల్ వేల్ఫేర్ సొసైటీ, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. 15 రోజుల ఉచిత శిక్షణలో ఎలా చేరాలో, శిక్షణతో ప్రయోగాలు తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎన్జీవో సభ్యుడు అబ్దుల్ వసీం, అద్నాన్, ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీదేవి, నిరత్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 23 : కాగజ్‌నగర్ పట్టణంలోని నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ప్రిన్సిపాల్ పార్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23తో గడువు ముగిసిందని, వచ్చే నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 4,807 మంది విద్యార్థులు 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.